

**బి.** య్యే ప్యాసయింది సావిత్రి. లెక్కలు బి.య్యేలో ఆపిల్లకి ఫస్టుక్లాసు వచ్చింది. తండ్రి పరంధామయ్యకి ఇంతకంటే గర్వం కాని మరో వ్యాపకంగాని లేదు తల్లి బంగారమ్మ మాత్రం ఎంతట ఓ అయ్యచేత దీన్ని పెడదామా, అని ఉవ్విళ్లూరేది. అందులోకి ఆ ఒక ఆయన ఎవరో పరాయివాడు గాకుండా మేనల్లుడు సత్యమే అయితే ఎంతో బాగుంటుందని ఆవిడ అభిప్రాయం. కాని ఆమె నోరు మెదపలేదు. ఆ యింట తల్లి ఒక్కర్తీ ఒక్కపక్షం—తండ్రీ కూతుళ్ళిద్దరూ ఒక పక్షం. బంగారమ్మ బి. ఎ. అవకపోవడం చేత; ఆవిడా; ఆవిడతోపాటు ఆవిడ మొత్తం వంశంఅంతా ఎడ్డెమనుష్యలని తీర్మానిస్తూవుంటారు పరంధామయ్యగారు అవకాశం దొరికినప్పుడల్లా.

సావిత్రికి ఏం తోచేదికాదు. శలవులు రావడం ఒకటీ, రెండోది వూరికే విసుగు వచ్చేడం; ఎవర్నయినా ఉడికించడం— అందం చందం డాబూదర్పం ప్రదర్శించి ఎవర్నైనా అల్లరిపెట్టడం గారాలపిల్ల సావిత్రికి యిష్టం; ఈ హాబీలు అంతగా తీరలేదు.

ఇంట్లో అమ్మ మాత్రం లోకువ. తండ్రి సరేసరి. వూళ్ళో ఎవరికెవరు గనుక :

పోనీ మావయ్యగారి వూరువెళదాం అనిపించింది. అది వుత్త పల్లెటూరు. మావయ్యా, అత్తయ్యా వాళ్ళ కొడుకు సత్యం ఎడ్డెమనుషులు ; ఇవి సావిత్రికి తండ్రి అవకాశం కలిగినప్పుడల్లా నూరి పోసిన విషయాలు. అంచేతనే సావిత్రికి ఆ వూరు వెళదామనిపించింది. 'కాకుల మధ్యకి వెడితేనే హంసకి రాణింపు' అనుకుంది.

రైలు ఆగుతూవుండగానేపోర్టరుకోసరం చూసింది సావిత్రి. అసలు స్టేషన్ నిర్మానుష్యంగావుంది. సావిత్రి దిగిందో లేదో రైలుకూసింది. ఆమెకి ఎవరిమీదో తెలీకండా కోపం వచ్చింది. తన హోల్డాలు తానే దింపుకోవడంకన్నా తల వొంపు యింకొకటిలేదు.

వెళ్ళిపోయిన రైలుకేసి కసిగా మాస్తున్న సావిత్రి, "కొంచెం ఆలస్యం అయ్యింది సావిత్రీ, పాడుయెద్దులు కొత్తం జేసేయి," అన్నమాటలు వినిపించి వెనుతిరిగింది. దాంతో ఆమెప్రాణం తెప్ప రిల్లిందిగానీ, ఆ భావాన్ని దాచేసి, వచ్చిన వ్యక్తిని కొత్త ఆటబొమ్మకేసి జూసినట్లు చూసింది.

'మీరు' అందామా 'నువ్వు' అని పిలుద్దామా అని చూసి; పంచే; బనీను లాంటి చొకా చూసి "నువ్వు మావయ్య గారి సత్యానివా" అని అడిగింది. "మరచి పొయ్యేవన్నమాట" అన్నాడు సత్యం నొచ్చుగుని, చిన్నబుచ్చుకుని.

సావిత్రిని సత్యం చాలా ఆప్యాయంగా చూసేడు. హోల్డాలు బండిలో పడేయ బోతూ "ఎక్కగలవా జాగ్రత్త" అని అడిగి, కచ్చితంగా ఆ పిల్లకి ఎడ్లబండీ ఎక్కడం రాదని గ్రహించి, హోల్డాలు క్రింద పడేసి 'దీనిమీద కాలేసి ఎక్కు' అని చెప్పేడు.

ఇంతలో స్టేషనుమాష్టరు సత్యాన్ని పలకరించేడు "మా అత్తయ్య కూతురు సావిత్రి" అని, చెప్పి, మళ్ళీ చటుక్కున జ్ఞాపకం తెచ్చుకొని "బియ్యే ప్యాసయ్యిం దండీ మాష్టారూ...అందుకే రెండెడ్ల బండీ ఎక్కడం రాదు" అని నవ్వేడు సత్యం.

బదులుగా స్టేషనుమాష్టరు కూడా వయసు మళ్ళిన నవ్వు ఒకటి నవ్వి తన పనిలో నిమ్మగు డయిపొయ్యేడు. సత్యం చిలిపితనం చమత్కారం సావిత్రి మెచ్చుకోలేదు. బి. ఎ. ఫేలయి వుడుక్కున్నాడనుకుంది.

"బండివాడివి నువ్వేనా, యింకా ఎంతదూరం వెళ్ళాలి?"- చాలా సిన్సి యర్‌గా అడుగుదా మనుకున్నా సావిత్రి, గొంతులో ఎక్కసక్కెం ధ్వనించింది. "చిత్తం" అంటూ సత్యం ఛంగున బండి మీది కెగిరి ఎద్దుల్ని అదిలిస్తూ ఎనిమిది మైళ్ళు వెళ్ళాలి, అన్నాడు.

చనువుగా మధ్య మధ్య కుశల ప్రశ్నలు వేస్తూ హుషారుగా వున్నాడు సత్యం. బండిలో గడ్డిమీద, ముళ్ళమీద

కూర్చున్నట్లు కూచున్నది సావిత్రి. నేరక పోయి వచ్చేనురా!" అన్నట్లు మొహం పెట్టుగుంది.

మువ్వలు గలగలమన ఎద్దులు పరిగెడుతూ వుంటే- సత్యం ముంగురులు మొహాన పడి నృత్యం చేస్తూ వుంటే- నీరెండలో చుట్టూతా పచ్చని చెట్లూ చేలూ ఎంతో అందంగా వెలిగిపోతూ ఉంటే... అంత ఆహ్లాదకరమైన ప్రయాణం కూడా సావిత్రి దర్పాన్ని చెరపలేకపోయింది! ...ఆ ప్రశాంతతా, పచ్చతోరణమూ, ఆమె వూహించుకున్నవి గాకపోవడం చేత బలవంతంగా ఆనందం అణగ తొక్కేసింది.

మిసమిసలాడే యౌవనంలో వున్న సత్యం నిండు విగ్రహమూ, చెంపకు చారెడేసి ఉన్న కళ్లల్లో నైర్మల్యమూ, మాటలలోని నిరాడంబరమూ కూడా ఆమె అహంకారాన్ని తగ్గించలేకపోయేయి. "పల్లెటూరి మొద్దు" అన్న మాటే బలవంతంగా మననం చేసుకుంటున్నట్లు ఆ పిల్ల అతనికేసి చూసింది.

"ఈ రోడ్డుమీద యీ నీ రెండలో బండి తోలుకుపోటం అంటే నా కెంతో సరదా తెలుసా!"— సత్యం చెప్పేడు కాని, సావిత్రి వినలేదు. ఆమె ముఖావం గ్రహించి "ఏం సావిత్రీ !" ఒంట్లో బాగాలేదా. ఇదో యిల్లు వచ్చేసిందిలే!" అని ఎద్దుల్ని అదలించాడు.

అలాగ అతడు అన్న అరగంటకి గాని ఇల్లు రాలేదు. మావయ్య యింట్లో లేడు. అత్తయ్య సుందరమ్మ ఎదురు వచ్చి "ఎన్నాళ్ల కెన్నాళ్ల కమ్మా! రా! రా! ఏళ్ళ తరబడి మేం అడగడమే గానీ నువ్వు రానూలేదు. మీవాళ్ళు పంపనూలేదు. అని సాదరంగా యింట్లోకి తీసుకుని వెళ్ళింది.

పెద్దదేమో గడప, దాటుతున్నప్పుడు సావిత్రి బొటనవేలికి తగిలింది. అంత లేసీ ద్వారబంధా లెందుకో అనుకుంది. ఇంటి ముంగిట ముగ్గులూ "ద్వారబంధం"గుమ్మాలకి రంగులూ మరీ కొట్ట వచ్చినట్లున్నాయి. ఇంట్లో ఏ ద్వారబంధమూ తలకి తగులదు. అన్నింటికి పెద్ద పెద్ద గాజు పూసలపేర్లు కట్టేరు.

సావిత్రి సుందరమ్మ వేసిన అన్ని కుశలప్రశ్నలకీ తనకు తోచినవిధంగా జవాబు లిచ్చింది. ఆమాత్రం గౌరవం చాలు. ఇదేం పరీక్ష పేపరు కాదుకదా అనుకుంది. అక్కడ తనకి మార్కులు రిమార్కులు యివ్వగల "మొనగాళ్లు" లేరని ఆమె ధైర్యం !

పెద్ద వెరట్లో సాయంత్రం సుందరమ్మ తులసిపూజ చేస్తున్నప్పుడు సావిత్రికి; సత్యం చెల్లెలు ఒక ఎనిమిదేళ్ళది- వసంత ఒక ముక్కాలిపీట తెచ్చి వేసి "కూచో వొదినా'' అంది. సావిత్రి కూచుంది.

"ఆకాశంనిండా పేదరాశి పెద్దమ్మ కుంకమూ పసుపూ ఎండేసుకుంది

వొదినా! చూడు"- వసంత ఏదో కొత్త వింత చెపుతున్నట్లు వేలెత్తి చూపించింది సావిత్రికి.

"ఎవరు చెప్పేరు నీకు నే చెబుతావిను. వెల్తురే అలాగ 'స్కేటర్' అయ్యింది"- సావిత్రి గర్వంగా చెప్పి విపులంగా చేప్పేననుకుంది. "నువ్వేం మాటాడు తున్నావో ఆ భాష నాకు తెలీద"న్నట్లు కళ్లింతజేసుకుని వసంత కిమ్మనకుండా అక్కడనుంచి వెళ్ళిపోయింది.

పెరడంతా పాదులూ మొక్కలూ ఎక్కువగా వున్నాయి. చిక్కిరి బిక్కిరిగా పసిపిల్లాడి వూహలలాగ ఒకదాని మీద ఒకటి, అల్లుకుని పోయేయి గడ్డి సైతం మొలిచింది. రకరకాల పూలూ తీగెలూ వున్నాయి. వాటిలో చాలాభాగం సావిత్రి ఎరుగనివి.

ఒక ప్రక్క ఆవుల సాలలో రెండు గేదెలూ, రెండు ఆవులూ వున్నాయి. అక్కడ ఏ మొక్కా మోతా లేవు. ఆవులలో కపిలగోవు సావిత్రికి నచ్చింది. రెండు కొబ్బరిచెట్లు. ఒక కరివేపాకు చెట్టూ వరుసగా వున్నాయి. పెద్ద బాదం చెట్టు కూడా వుంది. కొబ్బరిచెట్టుమీద నించి గబ గబ ఒక ఉడుత దిగివచ్చి తులసి కోటదగ్గర వెనకాళ్లమీద నుంచుంది. అది గబగబ ముందు రెండు చేతులతోనూ ఏదో తింటూ వుంటే వెక్కిరించినట్లుంది సావిత్రికి. నవ్వు కుంది ముచ్చటపడి తనలో తనే.

పాలు తియ్యడానికి దూడను వదుల్తూ సత్యం పాలచెంబుతో అక్కడికి వచ్చి "ఏం వసంతాలూ! మీ వొదిన నవ్వుతున్నదే. మన అదృష్టం పండిందన్న మాటే!" అని గబ గబా సాలలోకి వెళ్ళిపోయేడు.


సావిత్రికి చప్పున ఏ జవాబూ స్ఫురించలేదు. సత్యాన్ని మాటల్లో చిత్తు చెయ్యడానికి ఉదయం వచ్చినదగ్గర నుంచి తన విజ్ఞానం అంతా తిరిగేసి సావిత్రి చేసిన ప్రయత్నం ఫలించింది కాదు. ఆమె ఏమీ అనకుండా పౌరుషంగా వచ్చి, సత్యం పాలు పితుకుతూ వుంటే తదేకంగా అటు చూస్తూ నించుంది.

సత్యం వేగంగా పాలు రెండుచేతులతో పిండుతూనే సావిత్రికేసి తిరిగి "మా వూరు బావుండలేదూ!" అన్నాడు.

"ఏడ్చినట్లుంది" అని టపీమని జవాబిచ్చింది. సావిత్రి. "అమ్మయ్య యిప్పటికి దెబ్బతీసేను" అని నిట్టూర్చింది.

సత్యం కొంచెం నొచ్చుకున్న వాడల్లా తమాయించుకొని "సరేలే! మొదట్లో అలాగే అన్నా ... తర్వాత వదలి వెళ్ళలేనంటావ్ తెలుసా?" అని పాలుతీయడం ముగించి, "వసంతా! ఇది అమ్మకివ్వమ్మా!" అని చెంబు అక్కడ వుంచి నూతి దగ్గరికి వెళ్ళిపోయాడు.

చీకట్లు ముసిరి ఆకాశంమీద బిలాబిలా నక్షత్రాలు నిలిచేవరకూ పక్షులు ఒకటే గోల పెట్టేసేయి. సావిత్రి ఇన్ని రకాల




పిట్టలు యింత అల్లరి చెయ్యడం ఎన్నడూ చూడలేదు. వాళ్ళ పెరట్లో దేశవాళీ విదేశీ మొక్కలు రకరకాల పూలవి కొల్లలు వున్నాయి గాని యీ అల్లిబిల్లి మొక్కలే ఆమెని ముగ్ధురాల్ని జేసేయి.

అదివరకే తనకు వున్న ఎన్నో దురభిప్రాయాల్ని మార్చుకుందికి సావిత్రి అభిమానం వొప్పుకోలేదు కానీ, లేకపోతే యీపాటికే ఆ పిల్ల వెర్రి ఆనందంతో తువ్వాయితో ఆడీ వసంతతో పాడి, పూలు కోసుకొని గంతులు వేసేదే...

దీపాలు పెట్టిన కొంచెంసేపటికి రామచంద్రంగారు యింటికి వచ్చేరు.

కాళ్లు కడుక్కుంటూనే "అమ్మాయ్! సావిత్రీ అని కేకేసి సావిత్రి ప్రాణం విసిగేవరకూ కుశలప్రశ్నలు వేసేరు. ఆఖరికి "మీ ఇంట్లో నేను పోయినసారి వచ్చేసరికి మల్లి అంటు ఒకటి వేసేరు కదా! అది పూసిందా?" అని కూడా అడిగేరు. మీ వంటపుట్టి ఇదివరకావిదేనా? అవిశ కొంచెం చెయ్యి విసురు బాపతుటగదా ; మీ నాన్న తీసేస్తానన్నాడులే" అని భోగట్టా చేసేరు. "ఓ అవిడా! నేను యింటర్మీడియేట్ ఫస్టియర్ కదూ అప్పుడూ" అన్నది సావిత్రి.

సావిత్రికి మేనమామంటే సహజంగా కొంత భయమూ, గౌరవమూ వున్నాయి. అది తప్పించుకోలేనిది. అతగాడింక కుశల ప్రశ్నలు మానేసి "భోజనాలు చెయ్యండమ్మాయ్!" అని వీధి సావిట్లోకి వెళ్ళిపోయేదాకా అక్కడే నిలబడింది ఓపికగా.

వసంత పచ్చగా బంగారం ఛాయలో ముద్దు వస్తూవుంటుంది. ఉదత పిల్లలాగ చురుగ్గా వుంటుంది. కాని కొంచెం

గడుసరి. పల్లెటూరిదేమో మరి. ఈ పిల్ల ప్రశ్నలకే సావిత్రి తికమక అయ్యేది.

భోజనాలదగ్గర సావిత్రి తిండివాలకం చూసి "అయ్యో! తల్లీ మరీ తూచి తూచి తింటూన్నావేమిటి? అందుకే తోటకూర కాడలాగ యిలా అయిపోతున్నావ్!" అని ఆప్యాయంగా బెబ్బులాడింది. సుందరమ్మ.

"నా కింతే అలవాటత్తాయ్. అదీగాక అన్నం వుత్త 'స్టార్చ్'. అది తించే బలం ఏమీరాదు; అవన్నీ మీ చాదస్తాలు!" సావిత్రి పెరుగులో చెయ్యిపెట్టి అన్నం కెలుకుతూ డిఫెండ్ చేసుకోజూసింది.

"అది కాదమ్మా! లావెక్కిపోతామేమోనని బెంగ!... సావిత్రి ననేదేముందిలే, యీ కాలం కాలేజీఅమ్మాయిలందరికీ యిదే భయం!" కొంటెతనంగా అందుకున్నాడు సంభాషణ సత్యం.

టిక్కెట్టులేకుండా రైలు ఎక్కినవాడిని చూసినట్లు చూసి "నువ్వు కాలేజీ లన్నీ తిరిగి స్టడీచేసేవు కాబోలు!" అని దెప్పి పొడిచింది సావిత్రి.

సత్యం ఆమె వెటకారం పట్టించుగోకండా ముంతలో పెరుగు కుమ్మరించుగుని, రెండు అరటిపళ్లు అందులో వేసుకుని జుర్రడం మొదలెట్టాడు. సావిత్రి ఆశ్చర్యంగా అటు చూడడం గమనించి వసంత "వదినా! నేర్చుకుంటున్నావా?" అని నవ్వేసింది. "ఇదేం బ్రహ్మవిద్యా ...అల్జీబ్రా... నేర్చుకుందికి. బండా కూటి తిళ్లు నాకు అసహ్యం!" అని సావిత్రి చెయ్యి కడిగేసుకుంది సుందరమ్మ నొచ్చుకుందిగాని నోరు మెదపలేదు. భర్తదగ్గర ఆవిడకి చాలా భయం.

సత్యం వసంతా యిద్దరూ నేరస్థుల్లాగ మూతులు కడుక్కుని అవతలికి పోయేరు.

సావిత్రికి ఇంటిదగ్గర అలారం పెట్టుకున్నా తెలివి వచ్చేదికాదు. కాని అక్కడ కోడి కూతలు "లేస్తే కాని వదలవురా" అనిపించి—సూర్యోదయం అయ్యేసరికే లేచిపోయింది. వసంత కూడా గబుక్కున లేచివచ్చి "వదినా వొదినా! నీ ముహం జూసేనమ్మా! ఏం జరిగినా నీదేనమ్మా అది" అని సావిత్రిని పెరట్లోకి రెక్కపుచ్చుగుని తీసికెళ్లింది.

సత్యం చెట్టెక్కి వేప్పుల్ల విరుచుకుని పళ్లు తోముకుంటున్నాడు. సావిత్రి గర్వంగా టూత్ పేస్టూ, బ్రష్షూ పెట్టి పళ్లు తోముకుంది. వసంతకూడా పేస్టు పుచ్చుగుని "తియ్యగావుందే తల్లీ!" అనుకుంటూ కొంత తినేసింది.

సావిత్రి ఒక్కర్తికీ కాఫీ కలిపి ఇచ్చింది. సుందరమ్మ, వసంతా, సత్యం యిద్దరూ "చల్ది వణ్ణం" తిన్నారు. అంతలో రామచంద్రంగారు యింట్లోకి వచ్చి "అమ్మాయి సావిత్రీ! ఇదో యిడ్డెన్లు. అయ్యరు వేడి వేడి వాయి తీసి ఇచ్చేడు. మీకు మీ యింట్లో టిఫినా

యిరి—నాకా యిక్కడ దేవతార్చ నాయిరి—" అని అరడజను యిడ్లెన్న పొట్టం ఆమె చేతులలో పెట్టి, స్నానానికి వెళ్ళిపోయేడు.

"ఐతే యీ గ్రామంలో అయ్యరు హొటేలూ గాంధీపార్కూ కూడా వున్నా యన్నమాట!" అని వెటకారం చేసింది సావిత్రి సత్యాన్ని. సత్యం నవ్వుతూ "మీ వొదిన ఏమిటో అంటున్నది విను వసంతాలూ!" అన్నాడు చెల్లాయి నుద్దేశించి.

"అంతేకాదు వొదినా. మా వూళ్ళో సంత కూడా అవుతుంది ఎల్లుండి!" అమాయకంగా వసంత చెప్పింది.

"ఓహో! అలాగా!" అని కళ్లు చక్ర ల్లాగ తిప్పింది సావిత్రి. "మీ అన్నయ్య అక్కడ ఏమిటి అమ్ముతాడేమిటి?" అని, యిడ్లెన్లు రెండు తిని, తక్కినవి అవతలికి నెడుతూ అడిగింది.

"ఛీ! మేం కొనుక్కుంటాం" అని విసుక్కుంది వసంత.

సత్యంకేసి 'చూసుకో నా దర్జా' అన్నట్లు చూసి ప్లేటులోనే చెయ్యి కడుక్కుంది సావిత్రి.

సత్యం పనివున్నవాడిలాగ వెళ్లి పోయేడు. రామచంద్రంగారు దేవతార్చ నకి వెళ్ళిపోయేరు. వసంత బొమ్మలన్నీ పట్టుగుని పొరుగింటికి కాబోలు "తుర్రు" మన్నది

సావిత్రికి ఆ యింటి వ్యవహారమంతా ఆశ్చర్యంగా అగుపించింది. కుతూహలం కలిగింది. ఈ సత్యం తను అనుకున్నంత 'ఎంబన్న' కాడు. అత్తయ్య ఆచారం శుచీ శుభ్రం, కలుపుకోరుతనం అవీ సావిత్రికి నివ్వెరపాటు కలిగించాయి. వసంత మొదలు మామయ్యవరకూ ఆమె నింత పినరయినా కొత్తగానూ, ఎరుసుగానూ చూడరు.

సత్యం అందగాడని ఒప్పుకుంది సావిత్రి హృదయం. కాని తండ్రిచెప్పిన "ఎడ్డెరికం" యింకా అతనిలో వెతుకు తూనే వుంది ఆ పిల్ల మనసు. తను ఫస్టుక్లాసులో ప్యాసవుతే సత్యం ఫేలయ్యేడు. అందులోకి తను చదివింది మద్రాసులో. సత్యం చిన్నవూళ్లో. తనో లెక్కలు. సత్యం లిటరేచరు. సత్యానికి లెక్కలురావని సావిత్రి నమ్మకం. పోతే తనకి యింగ్లీషు లిటరేచరు తెగవచ్చును అనికూడా ఆ పిల్ల ధైర్యం!

సావిత్రి కల్పించుకున్న అసహ్యం... ప్రత్యక్షంగా కనిపిస్తున్న స్వర్గం... రెండిటి మధ్యా కెరటంమీద కెరటం లాగ ఆలోచనలు తిరుగుతు వుంటే హతాశయై వీధి గుమ్మంలోకి వెళ్ళి నిల్చుంది.

వీధి కొసదనుక అటూయిటూ మెడ సారించి చూసింది. మట్టిరోడ్డయినా చాలా మేరకు అలికి ముగ్గులున్నాయి. మధ్య మధ్య పాకలున్నా చాలావరకూ పెంకుటిళ్లే. పట్నంలోలాగ ముమ్మరంగా

పందులూ ''క్యూ'' లో వచ్చి, చెవులు చిల్లులు పడేలాగ అరిచే ముష్టివాళ్ళూ లేరు!...

ఒకరూ అర మనుషులుమాత్రం అక్కడ సందడి. కొందరు కన్నె పడుచులు పాదాలకు పసుపు రాసుకుని తడిజుట్టు ముడువేసుగుని చెరువునుంచి కాబోలు నీళ్లు తెచ్చుకుంటున్నారు.

అసెరమ్మంత బిందెలను మోసు కొస్తున్నా ఎక్కడా అలసటగానీ, గాభరాగాని లేకండా ఒయ్యారంగా నీళ్లు తెచ్చుకుంటున్న ఒకరిద్దరు తనతోటి పిల్లల్ను చూసి, సావిత్రి యీసుపడింది. వీళ్ళేం తింటారు చెపుమా? నాజూగ్గా కలువ కాడల్లాగ వున్నారు అనుకుంది.

ఇంతలో తన యీడుదే ఓ పద్దె నిమిదేళ్ళ కన్నెపిల్ల సావిత్రిని పరీక్షగా చూస్తూ పుస్తకాలు పట్టుగుని ఆ యింట్లోకి వచ్చింది. ముందుగదిలోకి తొంగిచూని ఎవరూ లేకపోవడం గమనించి వెనుదిరిగి సావిత్రినే అడిగింది. "ఏవండీ! సత్యం గారు లేరా?" అని నాగుపాములాగ అంతబారువున్న ఆ పిల్ల జెడ కేసి చూస్తూ వున్న సావిత్రి తెలివి తెచ్చుకుని "లేరు" —అంది, "ఏంగావాలి" అని అప్రయత్నంగా అడిగింది.

పట్నంలో బ్రతుకుతూ కాలేజీలో అంత చదువుకొన్న సావిత్రి సంస్కారమూ, నాగరికతా అన్నీకలిపి అనుకున్న దేమిటీ అంటే ఆ పిల్లనిగురించి సత్యంగురించీ అదోలాగ అనుకోవడం.

"పాఠం నేర్చుకుందికి వచ్చేనండీ" ... "పిన్నిగారు లేరల్లేవుంది" అని ఆ పిల్ల గదిలోకి వెళ్ళబోయి ఆగి, "మీ రెవరండీ" అని అడిగింది.

సావిత్రికి జవాబు వెంటనే స్ఫురించ లేదు. "మిస్ సావిత్రి బి.ఎ. " అన బోయి "నేను... నేను... ఇది మా మావయ్య ఇల్లు" అంది తడబడుతూ.

ఆ పిల్ల అంతలో చనువుగా నవ్వేని "అదా అలాచెప్పు మీరుసావిత్రివొదినన్న మాట" అని అడిగింది తనకేదో పెద్ద రహస్యం తెలిసినట్లు.

ఈ పరిచయం గమ్మత్తుగావుంది సావిత్రికి. 'నమస్కారం' అనడం— పొడి పొడిగా ఏవేవో మాటలనడం — మనిషి దుస్తులూ అవీ విల్వకడుతున్నట్లు చూసి "ఈ బ్లౌజు ఎక్కడకీసేరు", "మీ రే పౌడరు వాడుతారు" లాంటిప్రశ్నలు అడగడం—ఏమీలేదు ఇక్కడ.

ఈ ఇద్దరమ్మాయిలూ ఇంకా ఒకరి నొకరు అర్థంచేసుకున్నారో లేదో వసంత రివ్వున వచ్చి బొమ్మలబుట్ట అవతల పడేసి "అన్నయ్య పళ్ళగంప పట్టించు కొస్తున్నాడో!" అని 'అనౌన్సు' చేసింది రొప్పుతూ.

సత్యాన్నీ, పళ్ళగంపనీ ఎదుర్కొని "అన్నోయ్! ఇవన్నీ వొదినకే" అన్నది కొత్తపిల్ల నిర్మలంగా మొహం అంతజేసు



కొని చూస్తూ. సత్యం నవ్వుతూ "వస్తున్నానమ్మా ... కమలం! ఆ గదిలో కూచో" అని లోపలికి వెళ్ళిపోయేడు.

సావిత్రి సత్యం పట్టుగొచ్చిన పళ్ళు గంపకేసి చూసింది. "అబ్బ! ఎవరు తినను బాబూ ఇన్నిపళ్ళు!" అనుకుంది. "అందులోకీ 'సీతాఫలపుపళ్ళు' కూడాను ... వెక్కిరించినట్లు" — పైకి ఏమీ అనలేదు.

కమలం సత్యం గదిలోకి వెడుతూ "ఒదినా అన్నయ్యగది చూద్దువుగాని రా!" అని పిలిచింది. సావిత్రి రాతి బొమ్మలాగ నడిచి వెళ్ళింది.

"నువ్వేం చదువుతున్నావ్" అని గోడని అడిగినట్లు అడిగింది. కమలం చెప్పింది "హిందీ విశారదకి వెళుతున్నాను."

సావిత్రి "గతుక్కు"మంది బలవంతంగా కూడా తను నెత్తిన రుద్దిన హిందీలో అంతంత ప్రావీణ్యమే సంపాయించింది. అయితే సత్యం అంతవరకూ పాఠాలే చెపుతాడన్నమాట.

కమలం సావిత్రిని పరిశీలనగా చూస్తున్నది. వొదులుగా జెడ అల్లుగుని మొహాన చిన్న కుంకుమబొట్టు పెట్టుగుని వొదులుగా కుర్చీలో కూర్చొన్న సావిత్రి 'మగవాళ్ళలాగ కూర్చున్నట్ల'నిపించింది కమలానికి. "దర్జా" కాబోలు అనుకుంది. సావిత్రికి ఇదేంపట్టలేదు. కొంపదీసి తనని పాఠంచెప్పమనదుకదా బెంగగా కూర్చుని

చటుక్కున లేచి గది పరిశీలనగా చూడటం మొదలెట్టింది.

ఒకవేపు చిన్న బల్లా, కుర్చీ అమర్చి వున్నాయి. కుర్చీలో పులిచర్మం, బల్ల మీద చేనేత టేబిల్‌క్లాత్ వేసివున్నాయి.

పెద్ద రాక్ నిండా పుస్తకాలు ఉన్నాయి. చాలామట్టుకి తెలుగు, కొన్ని హిందీ తతిమ్మావి ఇంగ్లీషు. అవన్నీ ఆషామాషీగా తిరగేసి మళ్ళీ అందులోనే పెట్టేసింది సావిత్రి. ఇన్ని చదివిన సత్యం బియ్యే ఫేలవడాన్ని సమన్వయించలేకపోయింది సావిత్రి.

రాత్రిం బగళ్ళు లెక్కలే ప్రాణం! లెక్కలే పారాయణం. పది సంవత్సరాల యూనివర్సిటీ పేపర్లు తెప్పించి, ఆనర్సు చేసి నూరుకు తాగేసేసి, ఫస్టుక్లాసు తెచ్చుకున్న సావిత్రికి తనకేమీరాదు కాబోలు" అని, తుఫానుముందు కలిగే శూన్యమంత వెలితి కలిగింది.

కమలం కన్నార్పకుండా తనకేసి ఏ సరస్వతీదేవిలాగో చూస్తూవుండే సావిత్రి కొంత తృప్తిపడి "ఇవేం కొత్తవిగావు. అన్నీ నాకు కంఠతాయేలే" అన్నట్లు పుస్తకాలు వొదిలి తిరిగివచ్చి కూర్చొంది.

"వొదినోయ్! దానిమ్మపండు" అంటూ వసంత వచ్చింది. సావిత్రి వసంతని చూసి "సత్యం పళ్లు తినడమేనా, వచ్చి యీ అమ్మాయికి ఏమయినా పాఠం చెప్పడం వుందా" అని అడిగింది. కమలం ఈ పొడిమాటల కూర్పుకి నొచ్చుకుంది. మొహం కళావిహీనం చేసుగుంది. పట్నంలోని నాగరికులకుమల్లే గోడలు కట్టుగుని, మడిగా బతకడం తెలీని పిల్ల కమలం. 'ఒదినా' అని తను పిల్చిన సావిత్రి, తనని "ఈ అమ్మాయి" అని పుల్ల విరుపుగా అనడం సహించలేకపోయింది.

"అక్కయ్యా! నాకు అంబర్ చరఖా నేర్పవే" అన్నది వసంతం కమలం, వొళ్లో దబాయించి మరీ కూర్చొని.


"వొదిన్నడుగు" అన్నది కమలం. సావిత్రి గుండెల్లో రాయిపడింది. అదేమిటో ఎరుగదు సావిత్రి.

"నీకు బాగా వచ్చునా!" అని అడిగింది సావిత్రి సమయోచితంగా కమలాన్ని. అందుకు వసంత "అయ్యో తల్లీ! పరీక్ష పాసయిందే" అంది చేతులు తిప్పుతూ.

"ఇష్ వూరుకో అన్నయ్య" అన్నది కమలం తలుపుకేసి చూసి.

సావిత్రి లేచి గిరుక్కున అక్కడినించి వెళ్ళిపోయింది. కూడా వసంత వెంటబడి "ఎచ్చన గాయలాడతావా వొదినా" అని పట్టుగుంది. సావిత్రికి అదీ రాదు

తనకి వున్న దురభిప్రాయాలూ అవీ హలా చెరుపుకుని, నాలుగు రోజులయ్యే సరికల్లా సావిత్రి చాలా సర్దుకుంది. నూతిలో గిలకమీంచి తాడువేసి నీళ్ల కూడా రెండు మూడుసార్లు తోడుకుంది.




నూతిలో మొహం చూసుకుని మురిసి పోయింది.

వసంతమీద వాత్సల్యం, సత్యంమీద గౌరవం కొంచెం కొంచెంగా ఆమెకి తెలియకండానే ఆమెలో వృద్ధిపొందడం మొదలెట్టేయి.

పట్నంలో ఎంత సేపూ సూటూ బూటూ వేసుకున్న మగవాళ్లనే చూడ్డంచేత సత్యం మొరటుతనం అనిపించేదు గానీ, సత్యానికి ఏ దుస్తులయినా అతికినట్లుంటా యని అతని కాలేజీఫొటోలు చూసి అనుకుంది సావిత్రి.

"ఏం సావిత్రీదేవీ! ఏమిటి ఆలోచిస్తు న్నారు!" అని సత్యం నూతిదగ్గరకు వచ్చేడు. సత్యాన్ని చూసి ఉలిక్కి పడింది.

"పోవోయ్! నీ వూస్తుగాదు" అంటూ నూతిగట్టుకటువైపు తిరిగి వెళ్ళిపోయింది సావిత్రి. సావిత్రి 'పోవోయి' అన్నప్పుడు సిగ్గుదొంతర్లుపడింది. ఒయ్యారం! చిలిపి తనం చిందులువేశాయి కంఠంలో కంచుగంటలాంటి కంపితధ్వని వచ్చింది. సత్యం పులకించి ముగ్ధుడయ్యేడు నూతిలో తన మొహం చూసుకుని మురిసిపోయేడు.

సావిత్రి చాలా మారిపోయింది. ఆమెలో వసంతం వచ్చింది. సత్యంతో సరదాగా వెళ్ళి అంబర్ చరఖా చూసింది. రామచంద్రంగారి తోటల్లో, పొలాల్లో పసిపిల్లలాగ మైమరచి ఆడుకుంది.

ఒక చెరనించి, స్వేచ్ఛనిండిన మరొక లోకంలోకి రెక్కలు విప్పుకుని ఎగిరివచ్చిన పిట్టలాగునవుంది సావిత్రి హృదయం.

"సత్యం!" అన్నది సావిత్రి తూరుపు తెలవారుతూండగా. మువ్వలు

తాడుతో పేని గుచ్చి, తువ్వాయి మెళ్ళో కడుతూ.

"ఊఁ" అన్నాడు సత్యం గోముగా. సావిత్రి అక్కణ్ణించి వెళ్ళిపోయింది.

ఒక సాయంత్రం సావిత్రి అత్తయ్య "తులసీ జలజనాభకృప" పాట శ్రద్ధగా విన్నది. రాత్రి వెన్నెల పుచ్చపువ్వులా కాస్తుండగా "వెన్నెల ఎంతో బాగుంది" అనుకుంది సత్యాన్ని దగ్గరలోనే చూసి.

"మా, వూళ్ళో వెన్నెల సంగతే జ్ఞాపకం రాదుసుమా!'' అనుకుంది గట్టిగా అతనికి వినపడేలాగు.

"అందుకే మా వూళ్ళోనే వుండిపో గూడదూ హాయిగా!" అన్నాడు సత్యం సావిత్రి వెనకనే వచ్చి నించొని ఆమె శిరోజాల్ని మూర్కొని.

''నాకు సంగీతంరాదు సత్యం— వీణ వాయించలేను— అంబర్ చరఖా వొడకలేను- ఆఖరికి వంటకూడా రాదు సత్యం'' అని బేలపడిపోయింది సావిత్రి.

"అవన్నీ ఎందుకూ. ఎం ఏ. డిగ్రీ వస్తుందికదా.''

—ఓదార్పుగా అన్నాడు సత్యం.

'' ఉం " ... అయితే ఎం. ఏ. వచ్చేకా?" అని అడిగింది కోపంగా.

"తర్వాత పి. హెచ్ డీ''——

"తర్వాత?''

సత్యం జవాబుచెప్పలేదు. నిజానికి అతగాడికి స్ఫురించలేదు

సావిత్రి బరువుగా చెప్పింది "లేదు సత్యం నాకు ఏం.ఏ వద్దు. జీవితంకావాలి. ఆనందం కావాలి. యూనివర్సిటీలో చదువుకొని నేను సార్థకంచేసుకొనేది ఏమీలేదు"—

అక్కణ్నించి నెమ్మదిగా వెళ్ళిపోయింది సావిత్రి.

సత్యం దిగ్భ్రాంతుడై అక్కడే గుంజ కానుకుని వుండిపోయేడు. అతనిలో ఆనందం కట్టలు తెంచుకుని పరవళ్ళు తొక్కింది!...

పరవశుడయిన సత్యం ''ఏవండోయ్ బావగారూ! అత్తయ్య భోజనానికి రమ్మంటున్నది.... ఏ లోకంలో వున్నారు'' అన్న సావిత్రి మాటలకి ఉలిక్కిపడి,

"స్వర్గంలో" అన్నాడు.

